క్లుప్తంగా

చెత్త సేకరణ బుట్టల పంపిణీ


చెత్త సేకరణ బుట్టలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ దీపిక

దత్తిరాజేరు: ప్రభుత్వం సమకూర్చిన చెత్తసేకరణ బుట్టలను మండలంలోని గడసాంలో ప్రతి ఇంటికీ సర్పంచ్ నేతేటి దీపిక, పంచాయతీ కార్య దర్శి శ్రీనివాస్ మంగళవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని అన్నారు. చెత్తను ఇళ్ల ముందు, కాలువల్లో పారబోయకుండా బుట్టల్లో వేసి ఇళ్ల వద్దకు వచ్చే క్లాప్ మిత్రలకు అందజేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకు లు నేతేటి వెంకటరమణ, బూడి గణపతి, సుంకరి శివ పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన


మస్తర్ల సీట్లను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ హరిహరరావు

బొండపల్లి: మండలంలోని బి.రాజేరు గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీఓ ఎస్.హరిహరరావు మంగళవారం పరిశీలించారు. వేతనదారుల మస్తర్ల సీట్లను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతీ వేతనదారుడికి పని కల్పించాలని ఫీల్డ్‌అసిస్టెంట్‌కు సూచించారు. పనిప్రదేశంలో తప్పనిసరిగా తాగునీరు, నీడ కోసం టెంట్లు ఉండేలా చూడాలన్నారు.

పాఠశాలల సందర్శన


కరకవలసలో విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు


వేపాడ: మండలంలోని కరకవలస ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ బాలభాష్కరరావు, వెల్దాం ప్రాథమిక పాఠశాలను జగదీశ్వరరావు మంగళవారం సందర్శించారు. విద్యార్థుల హాజరు రికార్డులు, వర్క్ పుస్తకాలు, టీచర్ల లెసన్ ప్లాన్‌ను, మధ్యాహ్నభోజన వంటలను పరిశీలించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించి, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులకు ఎంఈఓలు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు చెప్పారు.

గడసాంలో ట్రైనీ కలెక్టర్ పర్యటన


సచివాలయంలో చెత్తసేకరణ బుట్టలను పరిశీలిస్తున్న ట్రైనీకలెక్టర్ వెంకటత్రివినాగ్

దత్తిరాజేరు: గడసాం గ్రామంలో ట్రైనీ కలెక్టర్ సహదిత్ వెంకటత్రివినాగ్ మంగళవారం ఉదయం పర్యటించారు. పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పనితీరు బాగో లేదని, ఇంటింట చెత్తసేకరణ చేయడం లేదని గ్రామ మాజీ సర్పంచ్ మురపాక జ్యోతిలక్ష్మి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో ఫిర్యాదు చేశారు. దీంతో ట్రైనీ కలెక్టర్ వెంకటత్రివినాగ్ గ్రామంలో పర్యటించి, గ్రామస్తుల సమస్యలను తెలుసుకున్నారు.అనంతరం సచివాలయాన్ని సందర్శించారు. సచివాలయంలో పంపిణీ చేయకుండా ఉంచిన చెత్త సేకరణ బుట్టలను పరిశీలించి, వెంటనే వాటిని గ్రామస్తులకు పంపిణీ చేయాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావును ఆదేశించారు.

ఎల్ఐపీ అమలు తీరు పరిశీలన


విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఎల్ఐపీ కో-ఆర్డినేటర్ ఉపేంద్రరెడ్డి

జామి: కుమరాం ఉన్నతపాఠశాలలో ఎల్ఈపీ (లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం) అమలు తీరును రాష్ట్రస్థాయి పరిశీలకులు, ఎల్ఐపీ కో-ఆర్డినేటర్ ఎస్.ఉపేంద్రరెడ్డి మంగళవారం పరిశీలించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై ఎల్ఐపీ కార్యక్రమం కృత్యాలు, సోపానాలు, ప్రాక్టీస్ పీరియడ్, టీచింగ్ పీరియడ్ నిర్వహించడంపై సూచనలు చేశారు. ఆయన వెంట ఎస్ఆర్‌జీఏ ప్రవీణ్‌కుమార్, హెచ్ఎం సీహెచ్.పద్మావతి తదితరులు ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ఢోకా లేదు

- అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న నాగళ్లవలస
- రూ.3 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు
- రూ.2 కోట్లతో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు
- పథకాల రూపంలో ప్రజలకు చేకూరిన లబ్ధి రూ.11.21 కోట్లు

నాగళ్లవలస సచివాలయం పరిధిలో పథకాల లబ్ధిదారులు, నగదు వివరాలు

పథకం	లబ్ధిదారులు	నగదు
జగనన్న అమ్మ ఒడి	209	రూ.99,66,755
జగన్న విద్యా దీవెన	153	రూ.34,40,535
జగనన్న వసతి దీవెన	107	రూ.17,72,743
రైతు భరోసా	306	రూ.1,43,78,500
వైఎస్సార్ చేయూత	217	రూ.1,05,75,000
వైఎస్సార్ ఆసరా	280	రూ.75,08,519
డ్వాక్రా సున్నా వడ్డీ	571	రూ.3,15,907
హౌసింగ్	31	రూ.55,80,000
వాహన మిత్ర	9	రూ.2,90,000
జగనన్న చేదోడు	11	రూ.2,50,000
వైఎస్సార్ బీమా	5	రూ.7,30,000
ఈబీసీ నేస్తం	5	రూ.1,35,000
వైఎస్సార్ కల్యాణమస్తు	5	రూ.2,50,000
వైఎస్సార్ పింఛన్ కానుక	329	రూ. 3,29,83,250


నాగళ్లవలస సచివాలయం


నాగళ్లవలసలో నిర్మించిన రక్షిత మంచినీటి ట్యాంకు

గుర్ల: నాడు ఆ గ్రామాల్లో ప్రజలు అనేక సమస్యలతో సతమతమయ్యే వారు. పరిష్కరించే నాథుడే కరువయ్యాడు. అరకొరగా అమలు చేసిన పథకాలకు సైతం అర్హత సాధించాలంటే నాయ కులు ఆశీస్సులు తప్పనిసరిగా ఉండాల్సిందే. విద్యుత్ లోవోల్టేజ్ సమస్యతో ప్రజలు, రైతులు ఇబ్బందులుపడేవారు. అలా ఉన్న నాగళ్లవలస సచివాలయం పరిధిలోని నాగళ్లవలస, సదానందపురం గ్రామాలు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన సంస్కరణల ఫలితంగా అభివృద్ధి బాటపట్టాయి. ఆయా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారం లభించింది. గ్రామాలు అభివృద్ధి చెందడంతో పాటు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సదానందపురం గ్రామాన్ని పంచాయతీగా చేసింది. నాగళ్లవలస, సదానందపురం పంచా యతీలను కలిపి నాగళ్లవలస సచివాలయంగా ఏర్పాటు చేశారు. ఈ సచివాలయం పరిధిలో సుమా రు రూ.3 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. నాగల్లవలసలో రూ.2కోట్లతో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. దీంతో నాగళ్లవలసతో పాటు చుట్టు పక్క ఎనిమిది గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతోంది. అలా గే సచివాలయం పరిధిలో రూ.6 లక్షలతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలు చేపట్టారు. రూ.40 లక్షలతో గ్రామ సచివాలయ భవనం నిర్మించారు. సొంత స్థలాలు ఉన్న 31 కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేసి, నిర్మాణాల కోసం రూ. 55.80 లక్షలను ప్రభుత్వం కేటాయించింది. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా రూ.40.84లక్షలతో నాగళ్లవలస, సదానందపురం ప్రాథమిక పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రభుత్వం కల్పించిన సదుపాయాలతో ఈ పాఠశాలల రూపురేఖలు మారాయి.నాగళ్లవలసలో రూ.65 లక్షలు, సదానందపురంలో రూ.32.81 లక్షలతో ఇంటింట తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేశారు. ప్రజలకు అన్ని రకాల ప్రభుత్వ సేవలు గ్రామ సచివాలయం వద్దే అందుతుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


సదానందపురంలో నిర్మించిన సీసీ రోడ్డు


నాగళ్లవలస ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడులో భాగంగా సమకూర్చిన బెంచీలు, ఇతర సదుపాయాలు


నాగళ్లవలసలో ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్


నాగళ్లవలసలో ఇంటింట తాగునీటి కుళాయిలు

సేవలన్నీ ఊరిలోనే అందుతున్నాయి..



ప్రతీ నెలా ఒకటో తేదీ ఉదయాన్నే వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ డబ్బులు అందజేస్తున్నారు. మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన పనిలేకుండా ప్రభుత్వ సేవలన్నీ గ్రామంలోని సచివాలయంలోనే అందుతున్నాయి. సచివాలయ సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ గ్రామంలో సమస్యలను పరిష్కారిస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటివద్దే వైద్యసేవలు అందుతున్నాయి.

– పిన్నింటి అచ్చియ్యమ్మ, నాగళ్లవలస

ఎవరిపైనా ఆధారపడాల్సిన పనిలేదు..



పింఛన్ డబ్బులు ప్రతినెలా ఒకటో తేదీన ఇస్తున్నారు. గత నెల నుంచి రూ.3 వేలు పింఛన్ ఇస్తున్నారు. అంతకుముందు రూ.2,750 అందేది. పింఛన్ డబ్బులతో మా అవసరాలు తీర్చుకుంటున్నాం.ఎవరిపైనా ఆధారపడాల్సిన పనిలేదు. ఆరోగ్య సమస్యలు ఉంటే ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో వైద్యం చేయించుకుంటున్నాం. ఉచితంగా మందులు అందజేస్తున్నారు.సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– ఎజ్జిపరుపు వరహాలమ్మ, సదానందపురం

ఉల్లాసంగా ఎడ్ల పరుగు పోటీలు

లక్కవరపుకోట: మండలంలోని రంగరాయపురం గ్రామంలో మరిడమాంబ తీర్థం సందర్భంగా మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి ఎడ్ల పరుగు పందెం పోటీలు ఉల్లాసంగా సాగాయి. ఈ పోటీల్లో విజయనగరం,అనకాపల్లి జిల్లాలకు చెందిన 12 ఎడ్ల బళ్లు పాల్గొన్నా యి. ఈపోటీల్లో వల్లంపూడి, వాయిలపాడు గ్రామాలకు చెందిన ఎడ్లు ప్రథమ, ద్వితీయస్థానంలో నిలిచాయని నిర్వా హకులు తెలిపారు. ఎడ్ల యజమానులకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు.

నేడు నల్లబిల్లిలో..

వేపాడ: మండలంలోని నల్లబిల్లి గ్రామంలో మల్లికార్జునస్వామి తీర్థం సందర్భంగా బుధవారం సాయంత్రం ఎడ్ల పరుగు ప్రదర్శన నిర్వ హించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వరుస అయిదు స్థానాల్లో నిలిచిన విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. భ్రమరాంభ, మల్లికార్జునస్వామికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.


లక్కవరపుకోట: పోటీల్లో పరుగు తీస్తున్న ఎడ్లు

బీమాతో కుటుంబానికి సామాజిక భద్రత


మృతుడి భార్య కళావతికు చెక్ అందజేస్తున్న తపాలాశాఖ సూపరింటెండెంట్ ఎస్‌వి.ఎస్.ఎన్.రాజు

చీపురుపల్లి: తపాలాశాఖలో బీమా పథకాలు తీసుకోవడం ద్వారా కుటుంబాలకు సామాజిక భద్రత లభిస్తుందని తపాలాశాఖ సూపరింటెండెంట్ ఎస్.వి.ఎస్.ఎన్.రాజు అన్నారు. మండలంలోని పి.కె.పాలవ లస గ్రామానికి చెందిన గంట్యాడ అప్పలసత్యం ఇటీవల ప్రమాదవశాత్తు మరణించారు. అప్పలసత్యం గతంలో తపాలాశాఖలో గ్రూప్ యాక్సిడెంట్ బీమా పాలసీ తీసుకున్నారు. దీంతో ఆయన కుటుంబానికి రూ.10 లక్షల బీమా పరిహారం మంజూరైంది. సంబంధిత చెక్‌ను మృతుడి భార్య కళావతికి తపాలాశాఖ సూపరింటెండెంట్ రాజు పి.కె.పాలవలసలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదికి కేవలం రూ.399 ప్రీమియం చెల్లిస్తే ఆ కుటుంబానికి ప్రమాద బీమా రూ.10 లక్షలు వరకు ఉంటుందన్నారు. ప్రతీ ఒక్కరూ బీమా చేయించుకోవాలని సూచించారు. పోస్టల్ ఇన్‌స్పెక్టర్ అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

'జియో' రామకృష్ణకు ఎక్స్‌లెన్స్ అవార్డు

శృంగవరపుకోట: పర్యావరణ పరిరక్షణకు ఎస్.కోట కేంద్రంగా పనిచేస్తున్న స్థానిక 'జియో' స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు బొబ్బిలి రామకృష్ణకు విశాఖపట్నానికి చెందిన ట్రావెల్, టూరిజం ఫౌండేషన్ బెస్ట్ హ్యుమానిటేరియన్ ఎక్స్‌లెన్స్ అవార్డు ప్రకటించింది. ప్రపంచ స్వచ్ఛంద సేవా సంస్థల దినోత్సవం సందర్భంగా విశాఖలోని ఓ హోటల్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో రామకృష్ణకు నిర్వాహకులు అవార్డు అందజేశారు. అతిథులుగా హాజరైన మెడికవర్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీరామ్మూర్తి, వరుణ్ హెల్త్ సెంటర్ వైస్‌ప్రెసిడెంట్ డాక్టర్ బంగార్రాజు, ఈశ్వరీయ విద్యాలయం బీకే కామేశ్వరి, వీ11 న్యూస్ చానల్ వ్యవస్థాపకురాలు కుమారి దీపికా గుణకుల, దర్శకుడు డాక్టర్ మణిభూషణ్ తదితరులు రామకృష్ణను సన్మానించారు.


రామకృష్ణను సన్మానిస్తున్న ట్రావెల్, టూరిజం ఫౌండేషన్ సభ్యులు, ప్రముఖులు

చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి

శృంగవరపుకోట: విప్లవజ్యోతి చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతిని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ కె.వాసుదేవ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ వాసుదేవ్ మాట్లాడుతూ చంద్రశేఖర్ ఆజాద్ చిన్నవయస్సులోనే దేశం కోసం ప్రాణత్యాగం చేశారన్నారు. ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ జి.ఈరన్న మాట్లాడుతూ మహాత్మా గాంధీజీ స్ఫూర్తితో చంద్రశేఖర్ ఆజాద్ చిన్నతనంలోనే స్వాతంత్య్ర పోరాటంలోకి వచ్చారని, ఆయన జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. లెక్చరర్లు సుధీర్, భాస్కరరావు, జి.సురేష్, కె.అప్పలరాజు, డి.హైమావతి, జి.లక్ష్మణ్ పాల్గొన్నారు.


చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

బీఐఎస్‌పై వర్క్‌షాప్

విజయనగరం రూరల్: భారత ప్రమాణాలపై (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) గ్రామ సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అవగాహన అవసరమని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి (ఏపీఆర్‌డీ) అకాడమీ డైరెక్టర్ ఆర్ కేశవరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు విజయనగరం జిల్లా పరిషత్ ప్రాంగణంలోని జిల్లా వనరుల కేంద్రంలో భారత ప్రమాణాలపై (బీఐఎస్) మంగళవారం నిర్వహించిన వర్క్‌షాపును ఏపీఆర్‌డీ అకాడమీ డైరెక్టర్ కేశవరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత ప్రమాణాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని గ్రామస్థాయికి తీసుకువెళ్లడానికి పంచాయతీరాజ్ శాఖతో సంయుక్తంగా బీఐఎస్ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ వర్క్‌షాపుతో ఐఎస్ఐ, హాల్‌మార్క్ వంటి నాణ్యతా ప్రమాణాల ప్రాముఖ్యంతో పాటు వాటి పరిధిలోకి వచ్చే వస్తువుల వినియోగంపై సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు అవగాహన పెంపొందించుకుని ప్రజలకు తెలియజేయాలని కోరారు. వచ్చే నెల 6 వరకు ఈ శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు. బీఐఎస్ చెన్నై సౌత్‌జోన్ జేడీ ఆర్.తిరుమలరావు భారత ప్రమాణాల ప్రాధాన్యతను, వాటి పరిధిలోకి వచ్చే వస్తువులను, హాల్‌మార్క్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో విజయనగరం డీఎల్‌డీవో జీఎస్ నిర్మలాదేవి, డీపీఆర్‌సీ ఏవో వేదవతి, డీపీఆర్‌సీ శిక్షణ మేనేజర్ ఎ.దేవుడు, ఆర్పీలు రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఆర్ఆర్‌డీఏ జేడీ ఆర్.కేశవరెడ్డి

ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవం రేపు

లక్కవరపుకోట: మండలంలోని పోతంపేట గ్రామంలో రైతు భరోసా కేంద్రం, సచివాలయం నూతన భవనాలను ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు గురువారం ఉదయం ప్రారంభించనున్నట్లు ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సుమారు రూ.75 లక్షలతో ఈభవనాలను నిర్మించినట్లు పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్థానిక, మండల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరు కావాలని కోరారు.

సరస్వతీదేవి విగ్రహావిష్కరణ


సరస్వతీదేవి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆర్జేడీ జ్యోతికుమారి,ఎంఈఓలు, ఉపాధ్యాయులు

గజపతినగరం: మండలంలోని మరుపల్లి మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహాన్ని ప్రిన్సిపాల్ గెద్ద ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఆర్జేడీ (రీజియన్ జాయింట్ డైరెక్టర్) జ్యోతికుమారి మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం పాఠశాలలోని తరగతి గదులు, ఇతర సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. 10వతరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం గ్రామంలోని కేజీబీవీని ఆమె సందర్శించారు. విద్యార్థినుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. ఎంఈఓలు విమలమ్మ, సాయిచక్రధర్, కేజీబీవీ ఎస్ఓ హైమ, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

విజయనగరం: రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు, కేఆర్ హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బి.కాంతారావు యాదవ్ కేర్ హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలోని 16వ డివిజన్ పరిధిలో గల బడుగు బలహీన పేద వర్గాల ప్రజలకు మంగళవారం ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ కాంతారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన స్ఫూర్తితో పేద ప్రజలకు అణగారిన వర్గాల వారిలో ఆర్థిక, సామాజిక చైతన్యం తీసుకువచ్చేందుకు బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ముద్దాడ మధు, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రీజియన్ కోఆర్డినేటర్ జాన కిరామ్, కేఆర్ హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం

- గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల నిర్వహణ
- 847 మందికి వైద్యపరీక్షలు


వేపాడ: పాటూరు వైద్యశిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్లు, వైద్యసిబ్బంది


గుర్ల: పున్నపురెడ్డిపేటలో మహిళకు మందుల కిట్ అందజేస్తున్న సన్యాసినాయుడు, తదితరులు


కొత్తవలస: అప్పన్నపాలెంలో నిర్వహించిన శిబిరంలో సేవలందిస్తున్న వైద్యుడు గోపాలకృష్ణ

గుర్ల: ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు సన్యాసినాయుడు అన్నారు. జగనన్న ఆరోగ్యసురక్షలో భాగంగా మండలంలోని పున్నపు రెడ్డి పేటలో మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరా ల ద్వారా ప్రజలకు గ్రామాల్లోనే మెరుగైన వైద్యసేవలు అందుతు న్నాయని చెప్పారు. ఎవరికైనా శస్త్ర చికిత్సలు అవసరమైతే ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ పరిధిలోని కార్పొరే ట్ ఆస్పత్రులకు సిఫార్సు చేస్తున్నట్లు పేర్కొన్నారు. శిబిరంలో 80 మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచి తంగా మందులు అందజేశామని గుర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి చెన్నయ్ తెలిపారు. నాయ కులు అప్పలనాయుడు, రామకృష్ణ, అశోక్ పాల్గొన్నారు.

అప్పన్నపాలెంలో...

కొత్తవలస: మండలంలోని అప్పన్నపాలెం గ్రామంలో వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం జగన్న ఆరోగ్యసురక్ష కార్యక్ర మం నిర్వహించారు. ఈశిబిరం లో 315 మందికి బీపీ, సుగర్, హెచ్‌బీ, మలేరియా,డెంగ్యూ, టీబీ, నేత్ర తదితర వైద్య పరీక్షలు చేశారు.12 మందిని నేత్ర శస్త్రచికిత్స లకు ఎంపిక చేశారు. అలాగే ఎముకుల సంబంధిత సమస్య లతో బాధపడుతున్న 57 మందిని కేజీహెచ్‌కు రిఫర్ చేశారు.

పాటూరులో..

వేపాడ: మండలంలోని పాటూరు గ్రామంలో బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్.రమాదేవి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. వైద్యాధికారి రమాదేవితో పాటు వైద్యులు కోటేశ్వరరావు, కృష్ణకుమారి, సీహెచ్ ఈశ్వరరావు 452 మందికి వైద్యసేవలందించారు. సాధారణ, నేత్ర, ఆర్థోపెడిక్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

మెనూ పాటించాలి

గజపతినగరం: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ప్రభుత్వం నిర్దేశించిన మెనూను పాటించాలని, విద్యార్థులకు నాణ్యమైన, రుచికర భోజనం అందించాలని మధ్యాహ్న భోజనం పథకం(ఎండీఎం) నిర్వాహకులకు ఎండీఎం అడిషనల్ డైరెక్టర్ ఏ.సుబ్బారెడ్డి సూచించారు. మరుపల్లి మోడల్, ఉన్నత, గొల్లలపేట ప్రాథమిక పాఠశాలలు, మరుపల్లి కేజీబీవీలో మంగళవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. మధ్యాహ్న భోజన వంటకాలను, వంట పదార్థాల స్టాక్‌ను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి రోజూ మెనూ ప్రకారం భోజనాలు అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు.ఆయన వెంట ఎంఈఓలు విమలమ్మ, సాయిచక్రధర్ మరుపల్లి ఉన్నత పాఠశాల హెచ్ఎం వి.నాగమణి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జి.ఈశ్వరరావు, కేజీబీవీ ఎస్ఓ హైమ తదితరులు ఉన్నారు.


మరుపల్లి మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు సూచనలు చేస్తున్న ఏడీ సుబ్బారెడ్డి

అలరించిన సంగీత విభావరి

విజయనగరం టౌన్: ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ 66వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కొత్తపేటలో ఉన్న ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన లలిత సంగీత విభావరి ఆద్యంతం ఆకట్టుకుంది. రేపల్లె రవికుమార్ సంగీత దర్శకత్వంలో హారిక శివరాం, లలిత కుమారి, రామరత్నం, సాయి సంపత్, సంగీత్ కుమార్‌లు చక్కని లలిత గీతాలాపన చేశారు. తబలపై చక్రపాణి సహకారమందించారు. భైరవభట్ల అన్నపూర్ణ, మహేశ్వరరావు, అబ్బులు, శారద కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి మండపాక రవి, తదితరులు పాల్గొన్నారు.


లలిత సంగీత గీతాలాపన చేస్తున్న గాయకులు